## క్లుప్తంగా

### కంటి రోగులకు ఆపరేషన్లు



రోగులను కంటి ఆపరేషన్లకు సిద్ధం చేస్తున్న వైద్యుడు సురేష్‌బాబు

**రాయచోటి అర్బన్ :** పట్టణ శివార్లలోని చెన్నముక్కపల్లెలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. వైద్య శిబిరానికి అన్నమయ్య జిల్లా పరిధిలోని నియోజకవర్గాలతోపాటు సత్యసాయి జిల్లాలోని పలు మండలాల కంటి రోగులు హాజరయ్యారు. మొత్తం 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో 23 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించి వెంటనే ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 35 మంది కంటి రోగులకు తిరిగి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### పందెంరాయుళ్ల అరెస్టు

**రామాపురం :** కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కస్తూర్బా పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ కొండారెడ్డి తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఇందులో కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, ఇద్దరు పరారయ్యారన్నారు. వారి వద్ద నుంచి రూ. 7,270లు నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గంగమ్మకు పూజలు

**లక్కిరెడ్డిపల్లె :** మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డిశేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతోపాటు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**చిట్వేలి :** స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం ఇందిరాగాంధీ 106వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రైల్వేకోడూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గేశాల దేవి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, బీసీ నాయకులు జయకర్, ఎస్సీ నాయకులు నాగరాజులు ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కోసం అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, ఆదిలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మల్లూరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ మల్లూరమ్మ

**చిన్నమండెం :** మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

### మహిళా దినోత్సవ వేడుకలు

**రామాపురం :** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవం వేడుకలను జరిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా గ్రంథాలయంలో జరిగే వారోత్సవాలకు విద్యార్థులు విశేష సంఖ్యలో పాల్గొంటారన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు పాల్గొంటారని తెలిపారు. స్థానికులందరూ విరివిగా గ్రంథాలయాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో తారకేశ్వరి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పరమ పవిత్రం.. కార్తీక సోమవారం

- కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాల వద్ద ఏర్పాట్లు
- ఉపవాసాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించనున్న భక్తులు



రాజంపేటలోని పురాతన రామలింగేశ్వర స్వామి దేవాలయం

**రాజంపేట టౌన్ :** హరిహరులకు ఎంతో ప్రీతికరమైన మాసం కార్తీక మాసం. ఈ మాసమంతా హిందువులు ఆధ్యాత్మిక భావనలో ఉంటారు. ముఖ్యంగా మహిళలు దీపాలు వెలిగించడం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తారు. అలాగే అనేక మంది భక్తులు ఉపవాసం ఆచరిస్తారు. సాయంత్రం పూజల అనంతరం ఉపవాస దీక్షను విరమిస్తారు. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో మాలలు ధరిస్తారు. నోములు ఉన్న వారు ఎంతో కఠిన నిష్ఠతో ఇళ్లల్లో, శివాలయాల్లో నోములు నోచుకుంటారు. కాగా తొలి సోమవారాన్ని పురస్కరించుకొని పెద్దఎత్తున తరలి వచ్చే భక్తులకు శివాలయాల్లో ఏర్పాట్లు చేశారు.

**దీపమే.. దైవం**

దీపం జ్యోతిపరబ్రహ్మం అంటారు. అంటే దీపమే దైవ స్వరూపమని అర్థం. లోకాల్లో చీకట్లను తొలగించే దీపారాధనకు ఈ మాసంలో ప్రాధాన్యతవుంది. దీపారాధనతో పాపాలు తొలగిపోతాయని శివభక్తుల విశ్వాసం. అందువల్ల హిందువులు ఈ మాసంలో తమ ఇళ్ళ ముంగిట, శివాలయాల్లో దీపాలను విధిగా వెలగిస్తారు. ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో దీపం వెలగించడం శ్రేష్ఠమని పురోహితులు చెబుతున్నారు.

**ప్రతిరోజు ప్రత్యేకమే**

కార్తీక మాసం విశిష్టమైనది. ఈ మాసంలోని ప్రతి రోజు పర్వదినమైనప్పటికీ కొన్ని ముఖ్య పర్వదినాలు మరింత ఫలప్రదమైనవని పురోహితులు చెబుతున్నారు. అవే కార్తీ శుక్ల పాడ్యమి, నాగుల చవితి, నాగ పంచమి, ఏకాదశి, కార్తీక పౌర్ణమి మొదలైనవి. ఈ పుణ్యమాసంలో కార్తీక సోమవారాలు పవిత్రమైనవిగా శివపురాణం తెలియజేస్తుంది. సోమవారం శివారాధన చేయడం, ఈశ్వరుడిని పంచామృతాలతో అభిషేకించడం, ఉపవాసం ఆచరించడం, నదీస్నానం చేసి దీపారాధన చేయడం వల్ల హరిహరుల అనుగ్రహం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఏడాది కార్తీకమాసంలో నాలుగు సోమవారాలు రానున్నాయి. ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11వ తేదీల్లో సోమవారం రానుంది. కార్తీక మాసంలో పౌర్ణమికి అత్యంత ప్రాధాన్యత ఉంది. కాగా ఈనెల 27వ తేదీ పౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో జ్వాలా దీపాలను వెలగించనున్నారు.

**పరమ పవిత్రమైన మాసం**



హరిహరులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం కార్తీకం. ఈ మాసంలో ప్రతిరోజు మహిమాన్వితమైనదే. శివునికి, విష్ణుమూర్తికి పూజలు చేస్తే సర్వ పాపాలు హరిస్తాయి. పరమ పవిత్రమైన ఈ మాసంలో భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో శివారాధన చేస్తే శుభాలు కలుగుతాయి.

– జనార్దన్‌స్వామి, ప్రముఖ పురోహితులు, రాజంపేట

# తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు



ర్యాలీ నిర్వహిస్తున్న సహకార బ్యాంక్ అధికారులు, సమాఖ్య సభ్యులు తదితరులు

**సిద్దవటం :** డీసీసీ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తామని డీసీసీ బ్యాంకు డీఆర్ ఓఎస్డీ గురప్ప తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం నుంచి 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కడప డీసీసీ బ్యాంకు, సిద్దవటంలోని డీసీసీ బ్యాంకు బ్రాంచి, సిద్దవటం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మండల పరస్పర సహకార పొదుపు సంఘాల సమాఖ్యలు కలిసి సిద్దవటంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురప్ప మాట్లాడుతూ ఎనిమిది లక్షల సహకార సంఘాల్లో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. భారత దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినోత్సవం నవంబర్ 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. పేద ,బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు, ఆర్థిక, సామాజిక, సాధికారిత కల్పించడమే కో – ఆపరేటివ్ బ్యాంకుల ప్రధాన ఉద్దేశమన్నారు. పీఏసీఎస్ ద్వారా మండలంలోని రైతులకు దీర్ఘకాళిక రుణాలు ఇస్తూ కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మండలంలో బ్రాంచి స్థాపించిదన్నారు. ఈ బ్యాంకు ద్వారా అనేక రకాలైన రుణాలను తక్కువ వడ్డీకే అందజేస్తున్నామన్నారు. బ్యాంకులో డిపాజిట్లు, రైతులకు, పేదలకు బాగా ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సిద్దవటం బ్రాంచి మేనేజర్ సుచిత్ర, సొసైటీ సీఈఓ సుకూర్, వెలుగు సీసీ నాయూబ్‌రసూల్, వీఓఏలు, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలి



సిద్దవటం: రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు తౌసిఫ్



రాజంపేట: పోలాను సన్మానిస్తున్న నిర్వాహకులు

**రాజంపేట :** పేదల కోసం మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం కాకతీయ విద్యాసంస్థల క్యాంపస్‌లో శ్రీ మారుతి హాస్పిటల్ (తిరుపతి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని పోలా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. ఇటువంటి తరుణంలో మనసున్న దాతలు కూడా ముందుకొచ్చి సహకరించాలన్నారు. ప్రముఖ కార్డియాలిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్, మేనేజింగ్ డైరెక్టర్ మారుతీ కృష్ణ, డాక్టర్ సాయికిరణ్‌ల ఆధ్వర్యంలో పేద రోగులకు గుండె పరీక్షలు, చికిత్సలు అందజేశారు. కార్యక్రమంలో అధినేత ఎం.రామకృష్ణ నాయుడు, కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, రాజంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కెఎం నరసింహులు పాల్గొన్నారు.

**ఉచిత వైద్య శిబిరానికి స్పందన**

**సిద్దవటం :** మండలంలోని మాధవరం – 1 గ్రామ పంచాయతీలోని శాంతి హెల్త్ క్లీనిక్‌లో ఆదివారం కడప నపగరం హోలిస్టిక్ ఆసుపత్రి వారు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణలు డాక్టర్ ఎం.డీ. నవీన్ అహ్మద్, జనరల్ మెడిషన్ డాక్టర్ తౌసిఫ్‌లు మాధవరం – 1 గ్రామ పరిసర ప్రాతాలకు చెందిన 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అంతేగాకుండా పేషంట్లకు రక్త నమూనాలు, బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఈసీహెచ్‌ఓ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గుండె పరీక్షలకు సంబంధించి పేషంట్లకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్సలు అందిస్తామని వారన్నారు. కార్యక్రమంలో స్థానిక శాంతి హెల్త్ క్లీనిక్ వైద్యుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, హోలిస్టిక్ ఆసుపత్రి వైద్య సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

# ‘సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే’





నూతనంగా ఎంపికైన బీటీఏ జిల్లా కమిటీ సభ్యులు

**రాయచోటి అర్బన్ :** సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీటీఏ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దుచేయాలని, జీపీఎస్‌లాంటి నూతన విధానాలను ఒప్పుకునే ప్రసక్తే లేదంటూ చెప్పారు. ఎన్నికల్లో ఎలాంటి హామీలు ఇవ్వని రాష్ట్రాలలో సైతం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయంటూ చెప్పారు. బోధనకు ఆటంకంగా మారిన యాప్స్‌ను రద్దుచేయాలని, యాప్స్ నిర్వహణకు ఒక ప్రత్యేక కంప్యూటర్‌ను నియమించాలన్నారు.

**బీటీఏ నూతన జిల్లా కార్యవర్గం ఎంపిక**

అనంతరం బీటీఏ నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా రాయచోటి రవిశంకర్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గణేష్ భూపతి, గౌరవాధ్యక్షుడిగా హబీబుల్లాఖాన్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఏ.వి.రమణ, రాజారత్నం, ట్రెజరర్‌గా రాజశేఖర్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా చిన్న చంద్రాయుడు, పల్లం జనార్దన్, సంయుక్త కార్యదర్శిగా పగడతోట రవిశంకర్, కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌నాయక్, స్టేట్ కౌన్సిలర్లుగా అబ్దుల్ రజాక్, రాజయ్య, పల్లం రామచంద్ర లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామంటూ ప్రకటించారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### అన్ని నియోజకవర్గాల్లోనూ నామినేషన్‌లు

**రాజంపేట రూరల్ :** గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం 175 నియోజకవర్గాలలో ఆర్‌ఎంపీలు, అనుబంధ సంఘాలు నామినేషన్‌లు వేయనున్నట్లు జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ డీవీఎస్ రాజు తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2024 ఎన్నికలలో పోటీ చేసే ప్రతి పార్టీ గ్రామీణ వైద్యుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు. ఏ పార్టీ అయితే ఆ విధంగా ప్రకటిస్తుందో ఆ పార్టీకి తమ పూర్తి మద్దతు తెలుపుతామన్నారు.

### బాధ్యతల స్వీకరణ



గంగమ్మను దర్శించుకుంటున్న సీఐలు

**లక్కిరెడ్డిపల్లె :** లక్కిరెడ్డిపల్లె సీఐగా జీవన్ గంగనాథబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. లక్కిరెడ్డిపల్లె సీఐగా పనిచేస్తున్న వరప్రసాద్ బదిలీపై రాయచోటికి వెళ్లగా నంద్యాల నుంచి బదిలీపై లక్కిరెడ్డిపల్లెకు జీవన్ గంగనాథబాబు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సీఐ గంగనాథబాబు బదిలీపై రాయచోటికి వెళ్లిన సీఐ వరప్రసాద్‌లు అనంతపురం గంగమ్మ దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### బహుమతుల అందజేత

**చిన్నమండెం :** చిన్నమండెం పంచాయతీలోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు వ్యాసరచన, చిత్రలేఖన, పుస్తక పఠనం ద్వారా ప్రపంచ విజ్ఞానం చారిత్రాత్మక పరిజ్ఞానం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో టీచర్ రఘునాథరెడ్డి, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రంథ పాలకుడు ఆంజనేయరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

**వాల్మీకిపురం:** దేశం కోసం పోరాడిన పరాక్రమ వంతురాలు ఝాన్సీలక్ష్మీబాయి అని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. ఆదివారం స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఝాన్సీలక్ష్మీబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# హిందీ ఉపాధ్యాయుడికి ప్రశంసలు



సమీర్‌బాషాను సన్మానించిన అధికారులు

**సిద్దవటం :** 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సేవలు అందించినందుకు ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు సమీర్‌బాషాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సమీర్‌బాషాకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్, డీఈఓ రాఘవరెడ్డి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ అంబవరపు ప్రభాకర్‌రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

# వరద బాధితులను ఆదుకోండి



డాక్టర్ అంబేద్కర్ నిరసన తెలుపున్న సీపీఎం, సీపీఐ నాయకులు

**రాజంపేట రూరల్ :** రెండు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు సర్వం కోల్పోయిన వరద బాధితులను ఆదుకోవడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు కావాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు సి.రవి కుమార్ ప్రశ్నించారు. జాతీయ రహదారి వద్ద నున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితుల పరామర్శకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 6 నెలలలో శాశ్వత గృహాలు నిర్మించనున్నట్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణమే వరద బాధితులకు నష్టపరిహారం అందించడంతోపాటు గృహనిర్మాణాలు పూర్తి చేసి ఆదుకోవాలని తెలిపారు. నిరసన తెలిపిన వారిలో సీపీఎం నాయకులు ఎస్.నరసింహ, సీపీఐ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్, ఏఐటీయుసీ నాయకులు నాగేశ్వరరావు, వెంకటేష్, బాబ్జాన్, చంద్ర, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# చురుగ్గా ‘రౌద్రముఖి’ చిత్రనిర్మాణం



రౌద్రముఖి చిత్ర నిర్మాణంలో ఓ సన్నివేశం

**పీలేరు :** మండలంలోని జాండ్ల పంచాయతీ శ్రీమద్గుండాల మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద అటవీ ప్రాంతంలో ‘రౌద్రముఖి’ చిత్రనిర్మాణం గత నాలుగు రోజులుగా చురుగ్గా జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు సురేష్, సుహేల్ మాట్లాడుతూ గత పది రోజులుగా తలకోన, దేవరకొండ ప్రాంతాల్లో షూటింగ్ చేయడం జరిగిందని తెలిపారు. మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలో అటవీ ప్రాంతంలో ఫైట్స్, యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. మూఢ నమ్మకాలు సమాజంపై చూపుతున్న చెడు ప్రభావం అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నటీనటులు ఆనంద్, విజయ్‌కుమార్, కృష్ణ, ప్రభు, సాక్షి, రాధాకృష్ణ, రాజు, సుధాకర, మల్లికార్జున, నాసర్, మహేష్, అమ్ములు ఉన్నారు.

# వరల్డ్ కప్ స్క్రీనింగ్‌లకు భారీ స్పందన



రాయచోటి: క్రీడాభిమానులు, చిన్నారులతో కలిసి మ్యాచ్ తిలకిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

**రాయచోటి :** ప్రపంచకప్ ఫైనల్ భారత్ – ఆస్ట్రేలియా మ్యాచ్ సందర్భంగా ఆదివారం ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేశారు. మ్యాచ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన లైవ్ స్ట్రీమింగ్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. వేలాది మంది వీక్షకులతో సందడిగా, కోలాహలంగా క్రీడా ప్రాంగణం మారింది. క్రీడాభిమానులు, ప్రజలు, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలిసి మ్యాచ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కూడా ప్రజలతో కలిసి నేలపై కూర్చొని వీక్షించారు.

**నందలూరులో..**

**నందలూరు (రాజంపేట) :** భారత్ – ఆస్ట్రేలియా మధ్య ఆదివారం ప్రారంభమైన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షణ కోసం ఐకేపీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అరవపల్లి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆర్‌ఎస్ రోడ్డులో స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ మ్యాచ్ జరుగుతున్నంతసేపు యువకులు భారత జెండాలు పట్టుకొని ఉత్సాహంగా తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, ఐకేపీఎస్ నాయకులు, వైఎస్సార్‌సీపీ, వివిధ పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థుల ఎంపిక





చిట్వేలి: మెమెంటోను అందుకుంటున్న లేఖన సాహితీ తదితరులు





రాయచోటి టౌన్: విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు

**రాయచోటి టౌన్ :** 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీలకు రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రేఖ తెలిపారు. ఈ నెల 18వ తేదీ అన్నమయ్య జిల్లాస్థాయి పోటీలు రాయచోటి డైట్ కేంద్రంలో నిర్వహించారన్నారు. ఈ పోటీలలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మొత్తం ఏడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా తమ పాఠశాలకు చెందిన నిష్రీన్ (9వ తరగతి), ఎస్. జాహ్నవి (9వ తరగతి)లు ఎంపిక య్యారని చెప్పారు. వీరిని ఆర్‌జెడీ ఎం.వెంకటకృష్ణారెడ్డి, సంబేపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, గైడ్ టీచర్ ప్రసన్నలు అభినందించినట్లు తెలిపారు.


**సైన్స్ కాంగ్రెస్‌కు చిట్వేలి విద్యార్థులు**

**చిట్వేలి :** రాయచోటి డైట్ కళాశాలలో శనివారం జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో చిట్వేలి విద్యార్థినీ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి తెలిపారు. రాష్ట్ర సాంకేతిక మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు జరిగాయని, ఇందులో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు శివదీక్షిత, లక్ష్మీ, త్రివేణి, విద్యార్థి యజ్ఞధర్, పోల్లోపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినీ లేఖన సాహితీలు రాష్ట్రస్థాయి పోటీలలకు ఎంపికై ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రశంసపత్రాలు, మెమెంటోలను అందుకున్నారని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంలో కృషి చేసిన గైడ్ ఉపాధ్యాయులు శివనారాయణ గౌడ్, చంద్రయ్య, పసుపుల రాజశేఖర్, హరినాథ్‌లను ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, రవీంద్రబాబులు అభినందించారు. ఈనెల 29, 30వ తేదీలలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

**నాగిరెడ్డిపల్లి విద్యార్థి ఎంపిక**

**నందలూరు (రాజంపేట) :** మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు చాణక్య, అఖిల్‌లు సైన్స్ ఉపాధ్యాయుడు బోగా వెంకటసుబ్బయ్య మార్గదర్శకత్వంలో తయారు చేసిన వెగస్ కర్డ్ అనే సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి తెలిపారు. రాయచోటి పట్టణంలో శనివారం అన్నమయ్య జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన జరిగింది. సుమారు 112 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వాటిలో ఏడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అందులో నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి చాణక్య ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు ఒకటి. తమ విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపట్ల పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది సైన్సు ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, శిల్పి ఆనందాచారి, లక్ష్మీనారాయణ, విజయకుమారి, రవిశంకర్ రెడ్డి తదితరులు విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాటంరెడ్డి మహల్ శిథిలాలపై కార్తీక దీపం



**రాజంపేట :** 11వ శతాబ్దం కాలం నాటి కాటంరెడ్డి మహల్ శిథిలాలపై ఆదివారం కార్తీక దీపం వెలిసింది. 11వ శతాబ్దం నాటి కాటంరెడ్డి ఆనవాళ్లు బయటపడిన రాంనగర్ కొండపై తొలిసారిగా విశ్వశాంతి కోసం కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపాన్ని వెలిగించారు. విశ్వశాంతి సర్వ మానవ సమానత్వం సౌభ్రాతృత్వం సహనం కోరుతూ కార్తీక దీపం వెలిగించడం జరిగిందని సంఘ సేవకుడు పోలి శివరామిరెడ్డి అన్నారు. కార్తీక దీపం వెలుగులో పట్టణం మరింతగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.